ప్రజాశక్తి
శనివారం 2 మార్చి 2024
5
విజయనగరం



పిటిసికి డిజిపి కమాండేషన్ డిస్క్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలోని పోలీసు ట్రైనింగ్ కళాశాలకు బిపిఆర్అండ్‌డి ప్రదానం చేసే కమాండేషన్ డిస్క్ లభించింది. ఈమేరకు గురువారం ఢిల్లీలో పిటిసి ప్రిన్సిపాల్ టి.ఆనంద్‌బాబుకు బిపిఆర్అండ్‌డి డిజిపి బాలాజీ శ్రీవాత్సవ్ ఈ డిస్క్‌ను అందజేశారు. దేశంలోని పోలీసు అకాడమీలు, శిక్షణ కళాశాలలను బిపిఆర్‌డి కమిటీ ఏటా సందర్శించి ఉత్తమ కళాశాలలను ఎంపిక చేస్తుంది. అందులో భాగంగా జిల్లాలోని కళాశాల 2021-22 సంవత్సరానికి గాను ఉత్తమంగా ఎంపికైంది. ఈనేపథ్యంలో ప్రిన్సిపాల్‌కు డిస్క్‌ను ప్రదానం చేశారు.

డిస్క్‌ను ప్రదానంచేస్తున్న బిపిఆర్‌డి డిజిపి బాలాజీ

తొలిరోజు ప్రశాంతం

- ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభం
- 1401 మంది విద్యార్థులు గైర్హాజరు
- క్షుణ్ణంగా పరిశీలించి లోపలికి పంపించిన సిబ్బంది

నగరంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వారందరినీ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించలేదు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి లేదని ముందే ప్రకటించడంతో పరీక్ష రాసే విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులు పరీక్ష రాసేందుకు హాల్ టికెట్,పెన్ , అట్ట తప్ప ఎటువంటి ఇతర వస్తువులు లోపలికి అనుమతించలేదు. మొదటి ఏడాది పరీక్ష రాస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గరుండి ఆటోలు, బైక్‌లపై కేంద్రాలకు తీసుకొచ్చారు. శుభాకాంక్షలు చెప్పి పంపించారు.

తొలి రోజు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 22253 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 20852 మంది హాజరయ్యారు. 1401 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలి రోజు పరీక్ష తెలుగుకు 8230 మంది, సంస్కృతం 8610 మంది, హిందీ పరీక్షకు 3785 మంది హాజరయ్యారు. గజపతినగరం శ్రీకృష్ణ జూనియర్ కాలేజీలో జరిగిన సంస్కృత పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని అధికారులు డిబార్ చేశారు. 73కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగిందని ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు.

వేపాడ : వేపాడలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సర విద్యార్థులు 222 మందికి గాను 211 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ బి.భాస్కర్ తెలిపారు. ఈ పరీక్షలకు డిపార్ట్మెంట్ అధికారిగా జి.మోహనరావు వ్యవహరించారు.

నెల్లిమర్ల : ఇంటర్ పరీక్షలకు తొలి రోజు 689 మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 437 మందికి 21మంది గైర్హాజర్ కాగా 416 మంది పరీక్షకు హాజరయ్యారు. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కేంద్రంలో 282 మందికి 9మంది గైర్హాజరు కాగా 273 మంది పరీక్షలకు హాజరయ్యారు.

వంగర: మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్ష మొదటిరోజు ప్రశాంతంగా జరిగింది. 178 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 170 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కొరటాన నారాయణరావు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో ఇక్కడ విద్యార్థులతోపాటు మడ్డువలస గురుకులం, వంగర కేజీబీవీ, రేగిడి మండలంలో గల ఉంగరాడ, దేవుదల కళాశాలల విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఆయన వెల్లడించారు.

పరీక్షా కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

మారుమూల ప్రాంతాల్లో మొబైల్ టవర్లు

టెలికాం ఆపరేటర్ల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వివిధ టెలికాం సంస్థల ద్వారా మొబైల్ సిగ్నల్స్ అందని మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి టెలికాం సంస్థల ప్రతినిధులను కోరారు. ప్రభుత్వ పరంగా టవర్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు సత్వరమే మంజూరుచేసి సహకరిస్తామన్నారు. ముఖ్యంగా ఎస్.కోట, రామభద్రపురం, గంట్యాడ తదితర మండలాల్లోని మారుమూల గిరిజన ప్రాంతాలకు మొబైల్ సేవలు అందడం లేదని, ఈ ప్రాంతాల్లో మొబైల్ నెట్వర్క్ లేని గ్రామాలకు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని టెలికాం సంస్థలు ముందుకు వచ్చి టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలోని ప్రధాన టెలికాం ఆపరేటర్లతో కలెక్టర్ శుక్రవారం తన ఛాంబరులో టెలిఫోన్ టవర్ల ఏర్పాటు, వాటికి అనుమతుల మంజూరుపై సమీక్షించారు.

రామభద్రపురం మండలం ఎనుబరువు, ఎస్.కోట మండలం పల్లపు దుంగాడ, గంట్యాడ మండలం డి.కె.పర్తి తదితర ప్రాంతాల్లో టెలికాం సిగ్నల్స్ అందడం లేదని, రానున్న ఎన్నికల దృష్ట్యా ఈ గ్రామాల్లో వెంటనే టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. మార్చి నెలాఖరులోగా ఎస్.కోట, గంట్యాడ, రామభద్రపురం మండలాల్లోని గ్రామాల్లో బి.ఎస్.ఎన్.ఎల్, రిలయన్స్ జియో సంస్థల్లో ఏ సంస్థ ద్వారా అవకాశం వుంటే వారితో ఏర్పాటు చేస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు. రామభద్రపురం మండలం రావివలస గ్రామ మైదాన ప్రాంతంలో వున్నప్పటికీ ఇక్కడ కూడా మొబైల్ సిగ్నల్స్ రావడం లేదని, అక్కడ ఏ సంస్థ ద్వారా మొబైల్ సేవలు అందించేందుకు అవకాశం వుందో పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం తహశీల్దార్ ప్రభాకరరావు, బిఎస్ఎన్ఎల్ జియో టెలికాం సంస్థల ప్రతినిధులు, ఫైబర్‌నెట్ ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు

బిందు సేద్యంపై అవగాహన కలిగించాలి

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జెసి కార్తీక్

ప్రజాశక్తి-విజయనగరం

వరి పంట తప్ప మిగిలిన అన్ని పంటలనూ బిందుసేద్యం ద్వారా సాగు చేయవచ్చని, రైతులకు ఈ విషయంపై అవగాహన కలిగించి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా విస్తీర్ణం పెంచాలని సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన జెసి మాట్లాడుతూ బిందు సేద్యం కింద 5ఎకరాల లోపు వ్యవసాయం ఉన్న రైతులకు 90 శాతం వరకు , 5ఎకరాల పై బడి ఉన్న వారికీ 50 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. ఇ క్రాప్ నమోదు, ఇకెవైసి శత శాతం పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వరావు మాట్లాడుతూ ధాన్యం దిగుబడిని పెంచడానికి సైంటిస్ట్‌లతో రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. జెసి స్పందిస్తూ ఆర్‌బికె స్థాయిలో పొలంబడి నిర్వహించి రైతులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. మట్టి నమూనాల పరీక్షలు నిర్వహిస్తున్న ప్పటికీ పోషకాల లోపాలను రైతులకు తెలియజేయడం లేదని, డిఎఎబి చైర్మన్ తెలపగా, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామా రావు స్పందిస్తూ ప్రస్తుతం నిధులు లేనందున మట్టి నమూనాల విశ్లేషణ చేయడం లేదని తెలిపారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ వి.చిన్న రామునాయుడు, డిఎఎబి సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మిమ్స్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల చేస్తున్న నిరసన కార్యక్రమం 31వ రోజుకి చేరుకుంది. శుక్రవారం స్థానిక ఆర్‌ఒబి వద్ద జరుగుతున్న నిరశన శిబిరంలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.సురేష్, అధ్యక్షులు టి.వి.రమణ మాట్లాడుతూ గత నెల రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరశన సమ్మెను యాజమాన్యం, ప్రభుత్వ అధికార్లు పట్టించుకోక పోవడం అన్యాయ మన్నారు. ముఖ్యంగా మిమ్స్ యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరించి గత మూడు సంవత్సరాలుగా ఉద్యోగులు, కార్మికులకు డిఎలు, వేతన ఒప్పందం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై అడిగితే సస్పెన్స్‌లు, బదిలీలు, గేటులో నిలబెట్టడం వంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో ఉద్యోగులు ఎం.నారాయణ, కె. కాము నాయుడు, గౌరి, ఎం.నాగభూషణం, వరలక్ష్మీ, మధు, బంగారు నాయుడు, మూర్తి, అప్పల నాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కేడర్‌లో అయోమయం

ఎన్నికలు సమీపిస్తున్న వేళ టిడిపి కేడర్‌లో అయోమయం నెలకొంది. జిల్లాలోని 7 నియోజకవర్గాలకు గాను ఇటీవల ఐదు నియోజకవర్గాల్లో టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థులను ఆయా పార్టీలు ప్రకటించిన విషయం తెలిసిందే. చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లో మాత్రం అభ్యర్థులను ప్రకటించలేదు. ప్రధానంగా ఎస్.కోట టిక్కెట్‌పై సందిగ్ధతో నెలకొంది. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ గ్రూపులుఉన్నాయి. వీరిలో ఎవరికి టిక్కెట్ వస్తుందోనన్న సందిగ్ధం కార్యకర్తల్లో నెలకొంది. వీరి ఇరువురూ టిక్కెట్‌కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

ప్రజాశక్తి - జామి

ఒకవైపు సీనియర్ నాయకులుగా నందమూరి కుటుంబానికి ఎంతో సన్నిహితమైన కోళ్ల కుటుంబానికి టిక్కెట్ ఖాయమని ఆ గ్రూపు నాయకులు చెబుతుంటే.. కాదు కాదు.. ఎన్నాళ్లైగా టిక్కెట్ ఆశిస్తున్న గొంప కృష్ణకే టిక్కెట్ దాదాపుగా ఖరారైందని ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలు గ్రూపులుగా విడిపోయిన పరిస్థితి నెలకొంది. జామి మండలంలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఎవరికి టిక్కెట్ వస్తే వేరే గ్రూపు సహకరిస్తుందా లేదా? అనే డైలామా నెలకొంది. రాజకీయ కురువద్ధుడు లడుగు సింహాద్రి లేకపోవడం మండలంలోని తెలుగు తమ్ముళ్లకు దిశా నిర్దేశం చేసే నాయకత్వం లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే టిడిపి, అభిమానులు, నాయకులు గందరగోళానికి గురవుతున్నారు.

గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి, టిడిపి, జనసేన పొత్తులో భాగంగా కొండపల్లి శ్రీనివాస్ కు టిక్కెట్ కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ఇక్కడ టిక్కెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెఎ నాయుడు.. శ్రీనివాస్ అభ్యర్థిత్వం పట్ల గుర్రుగా ఉన్నారు. నియోజక వర్గంలో జామి మండలానికి చెందిన 12 పంచాయతీల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు గత పదేళ్లుగా కెఎ నాయుడుతో ఉన్నారు. వీరంతా శ్రీనివాస్‌కు ఏమేరకు సహరిస్తారో వేచి చూడాల్సి. కొండపల్లి శ్రీనివాస్ అందరినీ కలుపుకొని పోయేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే గతంలో ఒకసారి తన ఓటమికి తన ఇంటి మనుషులే కారణమని భావిస్తున్న కె ఎ నాయుడు, అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించి అన్న కుమారుడు శ్రీనివాసకు మద్దతు తెలుపుతారా అన్నది ప్రశ్నార్ధకమే. పార్టీ నిర్ణయానికి కట్టుబడి మాజీ ఎమ్మెల్యే మాటను పక్కను పెట్టి, తెలుగు తమ్ముళ్లశ్రీనివాస్‌కు ఏమేరకు సహకరిస్తారో వేచి చూడాలి.

ఎస్.కోట టికెట్‌పై సందిగ్ధత

డిప్యూటీ సిఎం వ్యాఖ్యలు అర్ధరహితం

సిపిఎం జిల్లా నాయకులు వి.లక్ష్మి

ప్రజాశక్తి- మెంటాడ

సిపిఎం, గిరిజన సంఘాల నాయకుల పట్ల డిప్యూటీ సిఎం రాజన్నదొర చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, మెంటాడ మండల కార్యదర్శి రాకోటి రాములు అన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 'పోరాటాలు, ధర్నాలతో సమస్యలు పరిష్కారం కావు' అన్న డిప్యూటీ సిఎం మాటలను వారు ఖండించారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవు తాయని తాము గట్టిగా విశ్వసిస్తున్నామని చెప్పారు. అలాంటి పోరాటాలు, ధర్నాలను హేళన చేస్తూ మంత్రి రాజన్నదొర మాట్లాడడం తగదన్నారు. గిరిజనులు, దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తే మంత్రి రాజన్నదొర వినతి తీసుకోకుండా ఎదురు దాడి చేయడం తగదని హితవుపలికారు. ప్రతిపక్షంలో వున్నప్పుడు వైసిపి నాయకులు పోరాటాలు, ధర్నాలు చేయలేదా అని ప్రశ్నించారు. షెడ్యూల్‌లో లేని గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో కలపడానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రాజన్నదొర ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం పార్టీ, గిరిజన సంఘాలు మొదటి నుంచి పోరాడుతున్నాయని గుర్తు చేశారు. మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత ఐటిడిఎ పాలకవర్గ సమావేశం ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. మెంటాడ మండలంలో రిజర్వ్ ఫారెస్ట్ భూములను కైంకర్యం చేయడానికి కొంతమంది నాయకులు ప్రయత్నిస్తుంటే రాజన్నదొర ఎందుకు మౌనంగా వున్నారని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం జగన్ రెడ్డి ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తే పోరాడుతున్నది సిపిఎం, గిరిజన సంఘాలేనని రాజన్నదొర తెలుసుకోవాలని సూచించారు. అగ్రిగోల్డ్, అక్షయ్ గోల్డు మరియు పెత్తందారుల చేతుల్లోని ఉన్న భూములను గిరిజనులకు, పేదలకు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ఆంధ్ర జలాశయంలో గిరిజనులకు చేపలు పట్టుకునే హక్కు కల్పించలేదని, సొసైటీ ఏర్పాటు చేసి వారికి అప్పజెప్తామని రాజన్నదొర ఇచ్చిన హామీని నెరవేర్చలేదని తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా, గిరిజన శాఖ మంత్రిగా చిత్త శుద్ధితో గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, గిరిజన హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పోలింగ్ కేంద్రాలను కమిషనర్ ఎం.ఎం.నాయుడు శుక్రవారం పరిశీలించారు. రాజీవ్ నగర్ ప్రాథమిక పాఠశాల, సంగీత కళాశాల, మఠంవీధిలో ఉన్న శ్రమఫల పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ముఖ్యంగా ర్యాంపుల నిర్మాణం సరిగా ఉన్నాయా? లేదా, విద్యుత్తు సౌకర్యం, మరుగుదొడ్లు, నీటి సరఫరా, పరిసర ప్రాంతాల పరిశుభ్రత వంటి అంశాలను గమనించి లోటుపాట్లను సరిచేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల బాధ్యత వహించాలని కార్యదర్శులకు సూచించారు. ముందుగా వివిధ ప్రాంతాలలో పారిశుధ్య పనితీరును పరిశీలించారు. రహదారులపై చెత్త నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

3న జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో : జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 3న జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐదేళ్లలోపు పిల్లందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని కోరారు. పోలియో వ్యాధిని రూపుమాపేందుకు పోలియో చుక్కలు వేయించడమే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు సుమారు 1,98,478 మంది ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా పోలియో చుక్కలను వేయడానికి 1,182 బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామని డిఎంఅండ్‌హెచ్‌ఒ తెలిపారు. సుమారు 5వేల మంది ఈ కార్యక్రమంలో విధులను నిర్వహించడానికి సిద్ధమయ్యారని, 2,450 బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని 192 మంది సూపర్‌వైజర్లు, 66 మొబైల్ బృందాలు, 20 ట్రాన్సిట్ బృందాలు పర్యవేక్షిస్తాయని తెలిపారు. జిల్లాలో 56 కోల్డ్ చైన్ పాయింట్లను ఏర్పాటు చేశామని, 3,12,000 డోసులను సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలో 1999లో చివరిసారిగా రెండు పోలియో కేసులు నమోదయ్యాయని, అప్పటినుంచి నేటివరకు ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడానికి కారణం, పిల్లలందరికీ పోలియో చుక్కలను వేయించి ప్రజలు సహకరించడమే కారణమని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి పల్స్ పోలియోపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రాణి, జిల్లా టీకాధికారి డాక్టర్ అచ్చుతకుమారి పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 30వ డివిజన్ ధర్మపురిలో ఏర్పాటుచేసిన కుళాయి కనెక్షన్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పతివాడ గణపతిరావు, వైసిపి నాయకులు కనకల కృష్ణ మాట్లాడుతూ ధర్మపురిలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు నీటికి ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. సమస్య తెలుసుకున్న కోలగట్ల రూ.20 కోట్లు మంజూరు చేయించి వాటర్ ట్యాంకును నిర్మించి, కుళాయి కనెక్షన్లను ప్రారంభించి ప్రజల దాహార్తిని తీర్చారని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి డివిజన్ అధ్యక్షులు పూసర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుళాయిని ప్రారంభిస్తున్న కోలగట్ల

పన్ను బకాయిలపై వడ్డీమాఫీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోగా ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును ఒకేసారి లేదా వాయిదాలలో చెల్లిస్తేనే వడ్డీ మాఫీ వర్తిస్తుందని పేర్కొన్నారు. గతంలో వడ్డీ చెల్లించి ఉంటే పన్నుల్లో సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. కావున ఆస్తిపన్నుదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇందుకోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. నేరుగా నగదు రూపంలో గానీ, డిడి రూపంలో గానీ, ఆన్‌లైన్ విధానంలో గాని పన్ను చెల్లించుకోవచ్చని చెప్పారు. సకాలంలో పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

వచ్చే 43 రోజులు చాలా కీలకం

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలంటే రాబోయే 45 రోజులు చాలా కీలకమని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైసిపి విజయం కోసం అధినేత జగన్ నిర్దేశించిన సూచనల మేరకు ప్రతిఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. మంగళగిరి సికె కన్వెన్షన్లో సిఎంతో జరిగిన కీలక సమావేశం అనంతరం జిల్లాకు చేరుకున్న ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన ఉమ్మడి విజయనగరం జిల్లా పార్టీ శ్రేణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అన్ని స్థానాల్లో విజయం కోసం చేయాల్సిన పనులేంటో సిఎం వైఎస్ జగన్ స్పష్టంగా చెప్పారని, ఆయన చెప్పినట్టు నేతలు ప్రజలకు, ఓటర్లకూ ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ముఖ్యంగా పోలింగ్ బూత్ నిర్వహణ, ప్లానింగ్‌పై దృష్టి పెట్టాలని కోరారు. చంద్రబాబులా తాము తప్పుడు హామీలు ఇచ్చి విస్మరించలేదని, ఇచ్చిన హామీలే అమలు చేసి చూపించామనే అంశాన్ని ఇంటింటికీ వెళ్లి చెప్పాలని దిశానిర్దేశం చేశారు. జగన్ ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఇంటింటికీ చెప్పాలని తెలిపారు. అవినీతి కార్యకలాపాల్లో సిద్ధహస్తుడిగా జైలు ఊచలు లెక్కపెట్టి, జైలుకూడు తినొచ్చిన మాజీ సిఎం చంద్రబాబునాయుడు.. నిజాయతీగా రాజకీయాలు చేసే తనపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తూ నోటికి వచ్చిన కూతలు కూస్తే కనీస మర్యాద కూడా దక్కదని హెచ్చరించారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

43,209 మందికి రూ.30.31 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో విద్యార్థులకు అక్టోబరు - డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి ఫీజుల చెల్లింపు కోసం జగనన్న విద్యాదీవెన పథకం కింద ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం నిధులు విడుదల చేశారు. కృష్ణా జిల్లాలోని పామర్రులో జరిగిన కార్యక్రమంలో బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఫీజుల నిధులు జమ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జగనన్న విద్యాదీవెన కింద ఆయా విద్యార్థులు, వారి తల్లులకు ఫీజు మొత్తాలకు సంబంధించిన చెక్కును కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు అందజేశారు. జిల్లాలో మొత్తం 43,209 మంది కళాశాల విద్యార్థులు జగనన్న విద్యాదీవెన కింద లబ్ధిపొందుతున్నారని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. వీరికి రూ.30,31,38,187 జమ అవుతుందని చెప్పారు. జిల్లాలో 34,992 మంది బిసి, 3,846 మంది ఎస్‌సి, 2,535 మంది ఇబిసి, 915 మంది కాపు, 611 ఎస్‌టి, 266 ముస్లిం, 44 క్రిస్టియన్ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. జిల్లా బిసి సంక్షేమ అధికారి కె.సందీప్, సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, గిరిజన సంక్షేమ అధికారి చంద్రశేఖర్, మైనారిటీ సంక్షేమ అధికారి రుద్రపాటి శామ్యూల్ జాన్, సహాయ బి.సి.సంక్షేమ అధికారి యశోదనరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని రాజానగర్ కాలనీ, అమ్మిగారి కోనేరుగట్టు, ఒంకలో టాకీస్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, కృష్ణాపురం రోడ్డులో ఉన్న పాత డంపింగ్ యార్డును కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లు, కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని స్థానికులకు సూచించారు. పాత డంపింగ్ యార్డులో చెత్తను స్క్రీనింగ్ వేగవంతం చేయాలన్నారు. పింఛన్ల పంపిణీని పరిశీలించారు.

నేడు పారాదిలో న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పారాదిలో నేడు శనివారం సాయంత్రం 4 గంటలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, విద్యార్థులకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. సదస్సును జయప్రదం చేయాలని న్యాయవాదులు, పోలీసులు, ప్రజలను కోరారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై లోకాయుక్తకు ఫిర్యాదు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని మల్లమ్మపేటలో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు కొప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల జగన్ తెలిపారు. మల్లమ్మపేటలో గ్రామ కంఠంలో ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో లోకాయుక్తకు ఫిర్యాదుచేశామని తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణను గుర్తించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విజయనగరం మహారాజ కళాశాల (ఎంఆర్) రిటైర్డ్ ప్రిన్సిపాల్ గేదెల అప్పల నాయుడు (83) మృతి చెందారు. శుక్రవారం ఆయన స్వగ్రామం తంగుడుబిల్లి అనారోగ్యంతో ఆయన తుది శ్వాస విడిచారు. గ్రామంలో ఓ నిరుపేద వ్యవసాయ కుటుంబంలో పుట్టి తంగుడుబిల్లి గ్రామాన్ని విద్యా పరంగా అభివృద్ధి చేశారు. విజయనగరం మహారాజ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో 'సోషల్ స్టడీస్' లెక్చరర్, హెడ్జాఫ్ ది డిపార్ట్మెంట్, తాత్కాల ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. గ్రామంలో ఎంతోమంది యువకులను విద్యా రంగంలో ప్రోత్సాహించారు. పలువురు అప్పల నాయుడు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. పట్టణానికి చెందిన మహిళ పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం లచ్చయ్యపేట నుంచి బొబ్బిలి ఆటోలో వచ్చి చంటి బిడ్డతో కంగారుగా ఆటో దిగిపోయింది. ఆటోలో విలువైన వస్తువులతో ఉన్న బ్యాగ్ మరచిపోయింది. బ్యాగును ఆటో డ్రైవర్ మద్ది తాతలు పోలీస్ స్టేషన్‌కు అప్పగించగా పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఉన్న ఆధారాలు ఆధారంగా బాధిత మహిళకు బ్యాగ్ అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీని పోలీసులు అభినందించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాం ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డివిఎస్ అరుణ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ ఏదైనా ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులని తెలిపారు. ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన పరీక్ష ఏప్రిల్ 21న ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా మండల పరిధిలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలు కోసం పాఠశాల ప్రిన్సిపాల్, మండల విద్యాశాఖాధికారులను సంప్రదించాలని ఆమె కోరారు.

'బిసిల మద్దతు టిడిపికే'

ప్రజాశక్తి- విజయనగరం కోట

నగరంలో బిసిల మద్దతు టిడిపికేనని ఆ పార్టీ బిసి సెల్ నాయకులు కంది మురళీనాయుడు తెలిపారు. శుక్రవారం నగరంలోని 22, 23, 24, 25, 26 డివిజన్లకు సంబంధించి గరివిడి జంక్షన్‌లో జయహో బిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బిసిలకు జరుగుతున్న అన్యాయాలు, వారిపై దాడులు వంటి విషయాలను వివరించారు. టిడిపి- జనసేన పార్టీలకు మద్దతుగా బిసిలందరూ నిలవాలని కోరారు. కార్యక్రమంలో బిసి నాయకులు కొండ్రు శ్రీనివాసరావు, రొంగలి రామారావు, కనకల మురళీమోహన్, మామిడి దేవేంద్ర, పి.వెంకటేష్, పి.గోపి, బోను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డోర్ డెలివరీ తప్పనిసరి

ప్రజాశక్తి- మెరక ముడిదాం

ప్రభుత్వం ప్రజలకు రేషన్ షాపులు నుండి ఎండియు ఆపరేటర్లు ద్వారా అందిస్తున్న నిత్యావసర సరుకులను తప్పనిసరిగా డోర్ డెలివరీ చేయాలని మండల ఇంచార్జ్ సిఎస్‌డిటి పిన్నింటి రామారావు తెలిపారు. జిల్లా సివిల్ సప్లై అధికారి ఆదేశాలు ప్రకారం ఎండియు ఆపరేటర్లు తప్పనిసరిగా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు అందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్ణీత సమయంలో ప్రజలకు ఎండియు ఆపరేటర్లు అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 3వ తేదీన నగర వ్యాప్తంగా చేపట్టనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మల్లయ్య నాయుడు కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డనుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు విధిగా వేయించాలని అన్నారు. ఎ ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో పిల్లలకు చుక్కల మందు వేయించాలని చెప్పారు. నగరంలో నిర్దేశత పోలియో కేంద్రాల తో పాటు మొబైల్ పోలియో కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ కాంప్లెక్స్ తదితర జన సమర్థత ఉన్న ప్రాంతాలలో కూడా పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏర్పాట్లు సిద్ధం

రామభద్రపురం : ఈ నెల 3న పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీకి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు పిహెచ్‌సి వైద్యాధికారి పిల్లి దిలీప్‌కుమార్ తెలిపారు. తమ పరిధిలో ఉన్న 8 సచివాలయాల్లో 18 గ్రామాల్లో 12 కేంద్రాలు ఏర్పాటు చేసి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయిస్తామని తెలిపారు. హైరిస్క్ ప్రాంతాల్లో ఉన్న సంచార జీవులను గుర్తించి వారి పిల్లలకు కూడా మందు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 4, 5 తేదీల్లో మిగిలిన గృహ సందర్శన ద్వారా ఇంటింటా మందు పంపిణీకి చర్యలు తీసుకుంటామని వివరించారు.

నేటి నుంచి ఎంఎస్ఎంఇల సర్వే

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలోని అన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నమోదు కోసం మార్చి 1వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఒక సర్వే చేపట్టిందని, జిల్లాలోని అన్ని ఎంఎస్ఎంఇలు ఈ సర్వేలో నమోదు కావాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరచడం, వాటి అభివృద్ధి కోసం ప్రపంచబ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్రప్రభుత్వం చేపట్టిన ర్యాంప్ పథకంలో భాగంగా పరిశ్రమల నమోదును చేపడుతున్నామని తెలిపారు. గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ సహాయకులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు ఎమినీటి సెక్రటరీలు ఆయా సంస్థలకు సర్వే నిమిత్తం వచ్చినపుడు ఆయా పరిశ్రమల యాజమాన్యాలు తగు సమాచారం ఇవ్వడం ద్వారా సర్వేకు సహకరించాలని తెలిపారు. సర్వేకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

సర్వే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జెసి కార్తీక్

తయారీ, సేవా, వాణిజ్య రంగాల్లోని అన్ని ఎం.ఎస్.ఎం.ఇ.లను సర్వేచేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫాం లోకి తీసుకురావడం ద్వారా ఎపి ఎంఎస్ఎంఇ పోర్టల్‌కు అనుసంధానిస్తారని తెలిపారు. ఈ సంస్థలకు భవిష్యత్తులో బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించడం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం కోసం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు కల్పించడం కోసం ఈ సమాచారాన్ని వినియోగిస్తారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డి.ఆర్.ఓ. ఎస్.డి.అనిత, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

నగర పంచా యతీలో పన్నుల చెల్లింపులో వడ్డీ రాయితీపై అవగాహన కల్పించాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను వసూలు, వడ్డీ రాయితీ పై అధికార్లు, సచివాలయం సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నగర పంచాయతీలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులపై వడ్డీ రాయితీని కల్పిస్తూ ఒకేసారి పన్ను చెల్లించడానికి అవకాశం కల్పించిందన్నారు. ఒన్ టైం సెటిల్ మెంట్ కింద ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను ఒకేసారి 2023-24 సంవత్సరానికి ఈ నెల 31లోగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. ఇప్పటికే ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను వడ్డీతో సహా చెల్లించిన వారికి 2024-25 సంవత్సరంలో చెల్లించే పన్నులో సర్దుబాటు జరుగుతుందని తెలిపారు. నగర పంచాయతి వాసులు వడ్డీ రాయితీ సద్వినియోగం చేసుకోని నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాగా పన్నులు చెల్లించడానికి స్థానిక కార్యాలయంలో స్పెషల్ కౌంటర్ ఏర్పాటు చేశామని వడ్డీ రాయితీ పై అవగాహన కల్పించాలని, శత శాతం పన్నుల వసూళ్లకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వరరావు, ఆర్ఐ ఇన్‌స్పెక్టర్ ఎ. రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు చేసే వారికే ఓటు

ప్రజాశక్తి- గరివిడి

ఓట్ ఫర్ ఒపిఎస్ పత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

జివి ఎన్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేసిన వారికే ఓటు వేయాలని, ఆప్రాప్తికి రాబోయే ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీల మేనిఫెస్టోలలో ఒపిఎస్ అమలు చేస్తామనే విషయాన్ని చేర్చి అమలు చేస్తామని హామీ ఇవ్వాలని కోరుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భరోసా ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు డి. రాము పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులకు విజ్ఞాపన పత్రాలు ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి యుటిఎఫ్ ముద్రించిన ఓట్ ఫర్ ఒపిఎస్ ప్రచార పుస్తకాలను ఆయన రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ. సత్య శ్రీనివాసు, జిల్లా గౌరవ అధ్యక్షులు మీసాల అప్పల నాయుడు, జిల్లా కార్యదర్శి సూరి శ్రీనివాసరావు, మండల బాధ్యులు ఎం. రవికుమార్, జి. లక్ష్మణ, ఎం. సూర్యనారాయణ, ఐక్య సత్యనారాయణ, ఎం. రఘునాథరాజు,ఎ. కనకేశ్వరరావు, కోట్ల రమణ, త్రినాథ్‌లతో కలిసి ఆవిష్కరించారు.

ప్రతి కుటుంబాన్నీ కలవాలి : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రతి కుటుంబాన్నీ బూత్ కమిటీ సంప్రదించి వైసిపి ప్రభుత్వంలో వారికి అందిన లబ్ధిని వివరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సూచించారు. శుక్రవారం బొబ్బిలిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ పరిధిలోని బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదనే లక్ష్యంతో బూత్ కమిటీలను పక్కాగా నియమించామని చెప్పారు. ప్రతి కుటుంబంతో పార్టీ కేడర్ మమేకం కావాల్సిన అవసరం ఉందన్నారు. బూత్ స్థాయిలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి 'మేము సిద్ధం- మా బూత్ సిద్ధం' అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, గొలగాన రమాదేవి, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, జిల్లా జెసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, పట్టణ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి సిఎం సహాయ నిధి దోహదం

పేదల వైద్యానికి సిఎం సహాయ నిధి దోహదం చేస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు వైద్యం చేసేందుకు సిఎం సహాయనిధి దోహదం చేస్తుందని చెప్పారు.

సొంతింటి కల నెరవేర్చింది జగనే

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొత్తవలస

రాష్ట్రంలో ఇల్లు లేని పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలో కొత్తవలస -3 సచివాలయ పరిధిలో నిర్వహించిన నవరత్నాలు- - పేదలందరికీ ఇల్లు పట్టాల హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బలిఘట్టంలో 126, ముసిరాం 16, తుమ్మికాపల్లి 10, చినరావుపల్లి 4, కాటకాపల్లి 2, నిమ్మలపాలెం 57 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల పట్టాలతో పాటు పట్టా రిజిస్ట్రేషన్ కన్వేయన్స్ డీడ్స్‌ను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ , జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

సిఎం సహాయనిధితో ఎంతోమేలు

ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధితో ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయం వద్ద నియోజవర్గంలో ఏడుగురు లబ్ధిదారులకు సిఎం సహాయనిధి కింద రూ.5.60 లక్షల చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, ఎల్.కోట ఎంపిపి గేదెల శ్రీను, కాటకాపల్లి సర్పంచ్ కృష్ణ, వైసిపి జామి, వేపాడ, ఎల్.కోట మండలాల అధ్యక్షులు గొర్లె రవి, ఎం.జగన్నాథం, జి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్‌పి దీపిక

ఎస్‌పి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర చెక్‌పోస్టును ఎస్‌పి దీపిక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన తనిఖీలను పర్యవేక్షించి, రికార్డులను తనిఖీ చేశారు. వాహన తనిఖీల్లో వాహనాలను రోడ్డు పక్కగా ఆపాలని, వాహన రికార్డులు పరిశీలించి, వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఎస్‌పి సూచించారు. ఒడిశా నుండి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. చెక్ పోస్టు వద్ద నిఘా పెట్టేందుకు, తనిఖీలను పర్యవేక్షించేందుకు రెండు వైపులా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను, గంజాయి భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఎస్‌పి వెంట సిఐ ఉపేంద్ర, ఎస్‌ఐలు గంగరాజు, పోలినాయుడు, తదితరులు ఉన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-బొబ్బిలి

నిండుజీవితానికి రెండు పోలియో చుక్కలు 5ఏళ్ల లోపు పిల్లలకు ఇప్పించాలని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు తల్లి తండ్రులు పిలుపు నిచ్చారు. రోటరీ ఆధ్వర్యంలో శుక్రవారం నాయుడువలసలో పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలియో ని నిర్మూలిద్దాం, పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం...ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి... అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జె సి రాజు మాట్లాడుతూ పోలియో రహిత ప్రపంచమే లక్ష్యంగా అంతర్జాతీయ రోటరీ సంస్థ గత 45 సంవత్సరాలనుండి కృషి చేస్తున్నదని తెలిపారు. పిల్లలకు పోలియో చుక్కలు వేయించి వారి బంగారు భవిష్యత్ కు భరోసా కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొప్పె రవి, సివ్వన్నాయుడు, వేణు ,రాజశేఖర్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో జాతీయ సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు- గురజాడ యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సెమినార్‌ను వైస్ ఛాన్సలర్ వెంకట సుబ్బయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న సాంకేతిక మార్పులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సెమినార్ ప్రధాన అంశాలను నరేంద్ర నేరెళ్ల వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాదవులకు సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో యాదవులకు సీట్లు కేటాయించాలని ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం నాయకులు ముద్దాడ మధు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రయివేటు హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో యాదవులు సుమారు 3.20 లక్షల మంది ఉన్నారని, అందులో విజయనగరం నియోజకవర్గంలోనే 70 వేల మంది ఉన్నారని తెలిపారు. ఇంత జనాభా ఉన్న యాదవులకు పార్టీ సరైన గుర్తింపు ఇవ్వలేదని చెప్పారు. రానున్న ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గాన్ని బిసిలకు కేటాయించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ గుంప అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-కొత్తవలస

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల ప్రగతిపై డిఇఒ ప్రేమ కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తవలస హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.శ్రీదేవి, బండారు శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్‌ఎం ఈశ్వరరావు, సిబ్బంది, సిఆర్‌పి నాగరాజు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని కరకవలస ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. పాఠశాలలో చేపడుతున్న మరుగుదొడ్ల శ్లాబ్, సెప్టిక్ ట్యాంకు పనులను పరిశీలించారు. అనంతరం డబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. 1, 2 తరగతుల విద్యార్థుల వర్క్ బుక్స్, తెలుగు, ఇంగ్లీష్ చదవడం, మధ్యాహ్న భోజనం, పోలింగ్‌కు సదుపాయాలు వంటి అంశాలను పరిశీలించారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

శ్రీనివాస్ విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-గంట్యాడ

రానున్న ఎన్నికలలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ విజయానికి అందరూ కృషి చేయాలని మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు కోరారు శుక్రవారం మండలంలోని పెద్దమజ్జిపాలెం, మోకాళ్లపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. అందులో భాగంగా సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రతిఒక్కరికీ వివరించారు. గెలిపిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రఘుమండ పెంటమనాయుడు, రంది అప్పలనాయుడు, బండారు సూర్యారావు, పెంట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లెండిలో హ్యాక్‌థాన్ హ్యాక్ ట్రియాడ్

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజి నీరింగ్ కళాశాలలో శుక్రవారం స్మార్ట్ ఇంటెర్న్స్ సహకారంతో సంస్థ ప్లేసెమెంట్ సెల్ 72 గంటల హ్యాక్‌థాన్ హాక్ ట్రియాడ్ ప్రారంభమైంది. విశాఖపట్నం ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ సురేష్ నర్రా పాల్గొని మాట్లాడారు. అధునాతన సాంకేతికతకు కావల్సిన అంశాలను నేర్చుకోవడం వల్ల విద్యార్థులు ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన వివిధ రంగాలలో అవకాశాలను పొందగలుగుతారని ఆయన చెప్పారు. 72 గంటల ఛాలెంజ్‌లో పాల్గొనే ఉత్సాహం వార్ రూమ్ వాతావరణంలో వారికి సహాయపడుతుందన్నారు. అకడమిక్ ఇనిషియేటివ్ స్మార్ట్ బ్రిడ్జ్ ఇండియా డైరెక్టర్, యుక్తేష్ చింతమడక మాట్లాడుతూ హాక్ ట్రయాడ్ అనేది సృజనాత్మకత, నిర్ణీత సమయ వ్యవధిలో వేగవంతమైన సమస్య పరిష్కారాన్ని పెంపొందించే డైనమిక్ ప్లాట్‌ఫారమ్ అని చెప్పారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్స్ డీన్ జి. ప్రకాష్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి, సంస్థ వైస్ చైర్మన్ పి. శ్రీనివాస్ రావు, సెక్రటరీ అండ్ కరస్పాండంట్ కోడూరు శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ జి. ప్రకాష్‌బాబు, అన్ని విభాగాల హెచ్‌ఒడిలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని జగన్నాథపురం సమీపంలో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. గురువారం రాత్రి బలిజిపేట నుంచి బొబ్బిలి వైపు వస్తున్న కారు జగన్నాథపురం సమీపంలో అదుపు తప్పడంతో పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. విద్యుత్తు స్తంభం తప్పించుకుని పొలంలో ఉన్న వరి గడ్డికుప్పను ఢీకొనడంతో ప్రమాదం తప్పింది

చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

దొంగతనం కేసులో చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ డి. రామ గణేష్ తెలిపారు. శుక్రవారం ఆయన స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును స్థానిక పోలీసు స్టేషన్ లో చూపించారు. ఇటీవల కొత్త పేటలో జరిగిన దొంగతనం లో దొంగిలించబడ్డ బంగారం నెక్లెస్, లాకెట్ చైను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - వంగర

పురుగుల మందు తాగి రాగోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. ఎస్‌ఐ వైవి జనార్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన ధర్మాన రాజు (22) గ్రామ సమీపంలో గురువారం ఉదయం 8.30 గంటల సమయంలో పురుగుల మందు తాగేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులు రాజాంలో గల ఓ ఆసుపత్రికి తరలించి, అక్కడ నుంచి శ్రీకాకుళంలో గల రాగోలు ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విసమించడంతో మృతి చెందాడు. మృతునికి తల్లిదండ్రులతో పాటు చెల్లి, తమ్ముడు ఉన్నారు. తల్లి గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుంది. మృతుడు రాజు తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో పురుగుల మందు తాగి మృతి చెందినట్లుగా పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుని తమ్ముడు ఎర్రం నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శుక్రవారం తెలిపారు.

నోటీసు ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, విజయనగరం, విజయనగరం జిల్లా
ఎస్.ఓ.పి 08/2023

పిటీషనరు :
శ్రీమతి : భీమ్ పల్లి సూరమ్మ,
భర్త : అప్పలస్వామి, గృహిణి, కొండ లక్ష్మీపురం గ్రామ నివాసి, గరివిడి మండలం, విజయనగరం జిల్లా
రెస్పాండెంట్ :
సంబంధిత వ్యక్తులు ఎవరైనా

పై ఉదహరించిన ఎస్.ఓ.పి నందు పిటీషనర్, ఆమె సోదరుడు అయిన సాకేటి అప్పన్న ఉరఫ్ అప్పారావు, రైల్వే గ్యాంగ్ మ్యాన్ (డి.టి.ఎం.-16), భారతీయ రైల్వే, తేదీ.02.12.1997 దీన చీపురుపల్లి రైల్వే స్టేషన్ యందు విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవసాత్తు మరణించిన దరిమిలా వానికి సంభందించిన సెటిల్మెంట్ బెనిఫిట్స్ వగైరాలు వివిధ కార్యాలయముల నుండి రాబట్టుట కొరకు "సర్టిఫికేట్" పిటీషనరు పేరున పొందే నిమిత్తము పై నెంబర్ పిటీషన్ వేసి యున్నందున, అందుకు గాను శ్రీ కోర్టువారు ఆక్షేపణదారులకు నోటీసు/ప్రకటన ఆదేశించినందున అట్టి ఆక్షేపణదార్లు ఎవరైనా **07.03.2024 దిన ఉ|| 10.30 గంటల**కు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపనులు లిఖిత పూర్వకంగా తెలియజేయగలరు. అట్లు కాని ఎడల మీ పరోక్షంగా పై నెంబర్ పిటీషన్ యందు తీర్పు చేయగలవారు అని యిందుమూలంగా తెలియజేయబడింది.

పి.వెంకట గౌర్
న్యాయవాది, విజయనగరం
సెల్: 9949233951